సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం, 2, మే, 2023



జేడీ రహస్య విచారణ?
గద్వాల ఇరిగేషన్ శాఖలో సీపీఎస్ నిధుల కాజేతపై రహస్య విచారణ జరుగుతోంది.

వివరాలు 8లో ▸



శ్రీరస్తు.. శుభమస్తు
బుధవారం నుంచి శుభ ముహూర్తాలు ఉండటంతో భారీగా పెళ్లిళ్లు జరగనున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం 34.9 /22.1

వాతావరణం
గాలిలో తేమ శాతం అధికంగా ఉండడంతో చల్లగా ఉంటుంది. రోజంతా ఆకాశం మేఘావృతమై వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'ప్రజావాణి'కి 13 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఇందులో అత్యధికంగా ధరణికి సంబంధించిన ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించి కలెక్టర్ లాగిన్‌లో ఉన్నవి అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని ఆర్డీఓ, తహసీల్దార్ల లాగిన్‌లో ఉన్న వాటిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ధరణి కాకుండా ఇతర సమస్యలపై 13 ఫిర్యాదులు రాగా సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 8..
నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ మనోహర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 8 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భర్త వేధిస్తున్నాడని, తమను కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, 4 భూ సంబంధిత గొడవలు, ప్లాటు ఆక్రమించుకున్నాడని, అన్నదమ్ముల మధ్య గొడవలపై ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు.

రేపటి నుంచి సదరం శిబిరాల స్లాట్ బుకింగ్

కందనూలు: ఈ నెలకు సంబంధించి బుధవారం నుంచి సదరం శిబిరాల కోసం మీసేవలో స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక వికలాంగులకు ఈ నెల 10, 12, 17, 26 తేదీల్లో, వినికిడి లోపం ఉన్నవారికి 15, 29, కంటి చూపు లోపం ఉన్నవారికి 12, 26 తేదీల్లో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో స్లాట్ బుకింగ్ ఆధారంగా ప్రత్యేక శిబిరాలు ఉంటాయన్నారు. అలాగే మానసిక వికలాంగులకు ఈ నెల 15, 29 తేదీల్లో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో సదరం శిబిరం ఉంటుందని, అర్హత గల దివ్యాంగులు స్లాట్ బుకింగ్ తేదీల ప్రకారం శిబిరాలకు హాజరుకావాలని కోరారు.

నిరీక్షణకు ప్రతిఫలం

ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 911 మందికి లబ్ధి
- అత్యధికంగా ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో 468, ఆరోగ్యశాఖలో 397మందికి అవకాశం
- హర్షం వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కాంట్రాక్టు ఉద్యోగుల కొన్నేళ్ల నిరీక్షణకు ప్రతిఫలం లభించింది. వివిధ శాఖలలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వం ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసింది. ఉద్యమ సమయంలో ఇచ్చిన మాటను సీఎం కేసీఆర్ నిలబెట్టుకున్నారని.. కాంట్రాక్టు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేసిన వారిలో అత్యధికంగా విద్యాశాఖతోపాటు ఆరోగ్య శాఖలో ఉండగా.. మిగతా తక్కువ పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగులను చేర్చుకునే విధానాన్ని ప్రభుత్వం 2000 సంవత్సరంలో తీసుకువచ్చింది. అప్పటి నుంచి 2009 వరకు శాఖల్లో సిబ్బంది అవసరం ఆధారంగా ఉద్యోగులను నియమించారు. అయితే వీరిని ఔట్ సోర్సింగ్ సిబ్బంది మాదిరిగా తొలగించలేదు. అటు రెగ్యులరైజ్ చేయలేదు. ఉద్యోగ అభద్రతాభావంతో అనేక దశల్లో ఉద్యమాలు సైతం చేశారు. దీనికి ప్రతిఫలంగా ప్రభుత్వం ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది.

2016లోనే ఆమోదం..
2014 ఎన్నికల సమయంలో ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. 2014లో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2016లో జీఓ నం.16 ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై నిరుద్యోగులు నిరసన తెలుపుతూ కోర్టులో కేసులు వేయగా.. 2021లో కోర్టు ఈ కేసును కొట్టి వేసింది. 2019–18లో జిల్లాల వారీగా ఉన్న ఉద్యో గులు, వారి అర్హతలు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను ప్రభుత్వం పూర్తిచేసింది. తాజాగా పూర్తిస్థాయిలో రెగ్యులరైజేషన్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ క్రమంలో ఉమ్మడి పాలమూ రు జిల్లావ్యాప్తంగా ఉన్నత విద్యాశాఖకు సంబంధించి ఇంటర్మీడియట్‌లో 416 మంది, డిగ్రీలో 52, ఆరోగ్యశాఖలో 397, మిగతా వా టిలో 46 మంది ఉన్నారు. అయితే అర్హత, ఇత ర స్కిల్స్ ఆధారంగా రెగ్యులరైజ్ చేసే విషయంలో ఆయా శాఖలకు వివరాలు అందలేదు.



నాగర్‌కర్నూల్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

ఉమ్మడి జిల్లాలో రెగ్యులరైజ్ అయ్యే వారి వివరాలు

జిల్లా	ఇంటర్	డిగ్రీ	హెల్త్	ఇతర శాఖలు
మహబూబ్‌నగర్	123	11	140	12
జోగులాంబ గద్వాల	46	12	46	7
నాగర్‌కర్నూల్	96	10	78	8
వనపర్తి	81	11	70	10
నారాయణపేట	70	8	63	9

తక్కువ మందికి అవకాశం..
ఇతర శాఖలతో పోల్చితే ఒక్క డిగ్రీ లెక్చరర్‌లో మాత్రం పనిచేస్తున్న వారికంటే కూడా తక్కువ మందికి రెగ్యులరైజ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మొత్తం 156 మంది అధ్యాపకులు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తుండగా.. వీరిలో కేవలం 52 మందికి మాత్రమే అర్హత ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఉన్న డిగ్రీ అధ్యాపకులు విద్యార్హత ఉన్నా.. వారికి నెట్, సెట్ వాటిలో అర్హత పరీక్షలు, ఉత్తీర్ణులు కానందున రెగ్యులరైజేషన్ కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాల వారీగా రెగ్యులరైజేషన్ కావాల్సిన సిబ్బంది వివరాలు వెలువడితే మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

22 ఏళ్ల నుంచి..



22 ఏళ్ల నుంచి కాంట్రాక్టు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించిన కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెలబెట్టుకున్నారు. వేలాది మంది ఉద్యోగులు కాంట్రాక్టు వ్యవస్థ వల్ల తీవ్ర మానసిక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇన్నేళ్ల ఇబ్బందిని తీర్చిన కేసీఆర్‌కు కాంట్రాక్టు ఉద్యోగులు రుణపడి ఉంటారు.
– కరణం రాజు, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం, మహబూబ్‌నగర్

కష్టాలు తీర్చారు..



ఎన్నో ఏళ్లుగా ఉద్యోగ భద్రత లేక అనేక డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. ఇంటర్మీడియట్‌లో విధుల్లో చేరినప్పటి నుంచి విద్యార్థులు, కళాశాలల అభివృద్ధిలో కాంట్రాక్టు ఉద్యోగుల పాత్ర ఉంది. ఈ క్రమంలో కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడం హర్షించదగ్గ విషయం. – రషీద్, నారాయణపేట

మాట నిలబెట్టుకున్నారు..



2014లో కాంట్రాక్టు ఉద్యోగ, అధ్యాపకులకు కేసీఆర్ ఇచ్చిన హామీని ఇప్పుడు నిలబెట్టుకోవడం హర్షించదగ్గ విషయం. కాంట్రాక్టు వ్యవస్థ వెట్టి చాకిరి లాంటిది. దీనిని పూర్తిగా నిర్మూలించేందకు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. – నాగరాజు, నాగర్‌కర్నూల్

ఉద్యమ సమయంలో..



సుదీర్ఘ నిరీక్షణకు తెరదించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. 23 ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్‌లను, గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమ సమయంలోనే ఇచ్చిన హామీ మేరకే మమ్మల్ని రెగ్యులర్ చేశారు. – వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు, కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్

అందరికీ న్యాయం చేయాలి



ఉమ్మడి జిల్లాలోని పలు డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల్లో చాలా తక్కువ మంది మాత్రమే రెగ్యులరైజ్ కానున్నారు. మొత్తం 156 మంది పనిచేస్తుంటే.. 52 మంది మాత్రమే అర్హులు కానున్నారు. ఇన్నేళ్లుగా పనిచేస్తున్న మిగతా వారికి కూడా న్యాయం చేయాలి. కాస్త సమయం ఇచ్చి వారిని కూడా రెగ్యులరైజ్ చేయాలి. – ప్రవీణ్‌కుమార్, కాంట్రాక్టు డిగ్రీ అధ్యాపకుల సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

మా దేవుడు కేసీఆర్..



20 ఏళ్ల దుర్భర జీవితానికి ఫుల్‌స్టాప్ పెట్టిన సీఎం కేసీఆర్ మాకు దేవుడు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు 2016లో రాష్ట్ర ప్రభుత్వం జీఓ 16ను విడుదల చేసింది. కోర్టు కేసుల మూలంగా ఆలస్యమవుతున్న తరుణంలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు చొరవ తీసుకొని ఆయా కేసులను క్లియర్ చేయించి, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు మార్గం సుగమం చేశారు. – విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు, జిల్లా కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్‌బాబు

నాగర్‌కర్నూల్ క్రైం: చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, కార్మికులు 8 గంటల పనికి సమాన వేతనం పొందడానికి స్త్రీ పురుష భేదభావం లేదని ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రాజేష్‌బాబు అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆర్టీసీ డిపో ఆవరణలో కార్మికులకు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కార్మికులతో 8 గంటలు మాత్రమే పనిచేయించుకోవాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, స్త్రీపురుషుల వ్యత్యాసం లేకుండా చూసేలా పోరాటాలు చేసి హక్కులను సాధించుకున్నామని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్రతి శనివారం ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్నామని, సంవత్సర ఆదాయం రూ.లక్షకు తక్కువ ఉన్న ప్రతిఒక్కరికి తమ హక్కులను కాపాడుకోవడానికి ఎలాంటి సమస్య ఉన్నా లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించి ఉచిత న్యాయాన్ని పొందాలని సూచించారు. ఆర్టీసీ సేవలు ప్రత్యక్షంగా డ్రైవర్, కండక్టర్ ద్వారానే ప్రజలకు కనిపిస్తున్నాయని, కానీ మనకు కనిపించకుండా సేవలు అందిస్తున్న సిబ్బంది చాలామంది ఉన్నారన్నారు. కార్మికులందరూ సమష్టిగా పనిచేసినందుకే రవాణా వ్యవస్థ మనకు సేవలు అందిస్తుందని కొనియాడారు. నాగర్‌కర్నూల్ డిపోలో ప్రజల రవాణాకు ఒక్క ఏసీ బస్ లేదని, వెంటనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఏజీ శ్యాంసుందర్, మధుసూదన్‌రావు, పీపీలు తిరుపతయ్య, మాధవ లక్ష్మణ్, శ్రీరాం ఆర్య, డిపో మేనేజర్ ధరంసింగ్, కోర్టు సిబ్బంది కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో సక్సెస్



నాగర్‌కర్నూల్‌లో ఆస్తిపన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

- ఏప్రిల్‌లో పన్నుల వసూలుకు 5 శాతం రాయితీ ప్రకటన
- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల నుంచి రూ.2 కోట్లు వసూలు
- అత్యధికంగా నాగర్‌కర్నూల్‌లో రూ.85 లక్షలు..

నాగర్‌కర్నూల్: మున్సిపాలిటీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటిగా ఫలిస్తున్నాయి. ఇందులో భాగంగా గత నెలలో 2023– 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను చెల్లించాలనుకునే వారికి 5 శాతం రాయితీ ప్రకటించింది. దీంతో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. దాదాపు సంవత్సర లక్ష్యానికి సంబంధించి ఒక్క నెలలోనే 20 శాతానికి పైగా వసూలు అయ్యాయి. అనుకున్న స్థాయిలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్‌కు సంబంధించిన పన్నులు రాబట్టగలిగారు.

జిల్లా పరిధిలో..
జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట మున్సిపాలిటీల్లో కలిపి 30,002 గృహాలు ఉన్నాయి. వీటికి సంబంధించి 2023– 24 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.10 కోట్ల వరకు ఆస్తిపన్ను వసూలు చేయాలనే లక్ష్యాన్ని అధికారులు నిర్దేశించుకున్నారు. ఇందులో భాగంగా ప్రతిఏటా మార్చి నెలలో పన్నుల వసూళ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించే మున్సిపల్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 5 శాతం రాయితీ అవకాశాన్ని పెద్దఎత్తున ప్రచారం చేయడంతో ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది.

గతంలో భిన్న పరిస్థితులు..
గతంలో మున్సిపాలిటీ ఆస్తి పన్ను వసూలుకు సంబంధించి భిన్న పరిస్థితులు ఉండేవి. మార్చి దగ్గర పడుతున్న సమయంలోనే సిబ్బందితో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేవారు. దీంతో ఒక్క నెలలోనే వందశాతం పన్నులు వసూలు చేయడం సాధ్యం కాక మున్సిపాలిటీలు ఆర్థిక ఇబ్బందులతో కొనసాగేవి. మార్చి ముగిసిన తర్వాత 2, 3 నెలలు పన్నులు వసూలయ్యేవి కాదు. కానీ, ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి 20 శాతానికి పైగా వసూలు కావడంతో వందశాతం పన్నులు వసూలు చేయడం కొంత సులభతరమయ్యే అవకాశం ఉంది.

మున్సిపాలిటీల వారీగా..
నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో 10,006 గృహాలు ఉండగా ఆర్థిక సంవత్సరంలో రూ.3.75 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలి. అయితే ఒక్క ఏప్రిల్‌లోనే రూ.85 లక్షలు పన్నుల రూపంలో వసూలు రాబట్టడం జరిగింది. అచ్చంపేటలో మొత్తం 6,193 గృహాలు ఉండగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3.25 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికే రూ.40 లక్షలు వసూలయ్యాయి. కల్వకుర్తి మున్సిపాలిటీలో 7,705 గృహాలు ఉండగా రూ.1.89 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరం రాబట్టాల్సి ఉండగా ఇప్పటికే రూ.60 లక్షలు వసూలు చేశారు. కొల్లాపూర్ పరిధిలో 6,108 గృహాలు ఉండగా రూ.1.03 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికే రూ.22 లక్షలు వసూలు చేయడం జరిగింది. జిల్లావ్యాప్తంగా రూ.2.07 కోట్లు ఏప్రిల్ నెలలోనే వసూలు చేయడం గమనార్హం.

అభివృద్ధికి సహకారం..



ప్రభుత్వం పన్నుల వసూలుపై 5 శాతం రాయితీ ప్రకటించడంతో మంచి ఫలితం వచ్చింది. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో ఒక్క ఏప్రిల్ నెలలోనే రూ.85 లక్షల పన్నులు వసూలయ్యాయి. ప్రజల నుంచి కూడా మంచి స్పందన వచ్చింది. ప్రజలు పన్నులు ఎప్పటికప్పుడు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి. – జయంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, నాగర్‌కర్నూల్

డోంట్ వర్రీ.. ఫోన్ రికవరీ

- సీఈఐఆర్ సాంకేతికతతో సులభంగా గుర్తింపు
- ఇకపై అపహరించిన ఫోన్ పనిచేయదు
- జిల్లాలో 10 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగింత
- ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు



రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేస్తున్న పోలీసులు (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రస్తుత జీవనశైలిలో సెల్‌ఫోన్ అత్యంత కీలకమైంది. సమాచారం తెలుసుకోవాలన్నా.. నగదు చెల్లింపులు చేయాలన్నా.. ఏదైనా దరఖాస్తు చేసుకోవాలన్నా.. సెల్‌ఫోన్‌పైనే ఆధారపడుతున్నాం. ఇంతటి ప్రాధాన్యం సంతరించుకున్న ఫోన్ చోరీకి గురైతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నా.. పోయిన ఫోన్ కంటే కూడా అందులో ఉండే డేటా కోసం ఆందోళన చెందేవారు. ప్రస్తుతం విద్యార్థుల నుంచి ముసలి వారి దాకా స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో తమ వ్యక్తిగత, వృత్తి సమాచారాన్ని పలు సాఫ్ట్ కాపీల రూపంలో ఫోన్‌లోనే భద్రపరుచుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మన దైనందిక జీవితంలో ఫోన్ కీలకంగా మారింది. ఈ క్రమంలో పోయిన ఫోన్లను వెతికి పెట్టడానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఇది వరకే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన సీఈఐఆర్ విధానం మరింత చేయూతనిస్తోంది.

ఇలా చేయండి..
ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే https://www.ceir.gov.in పోర్టల్ ఓపెన్ చేయాలి. అందులో బ్లాక్ ఫోన్ అనే ఆప్షన్ ఎంచుకోవాలి. అందులో మొబైల్ నంబర్– 1, మొబైల్ నంబర్– 2, సెల్‌ఫోన్ బ్రాండ్ మోడల్, ఇన్వాయిస్ (బిల్) ఫొటో సూచించిన గడుల్లో నింపాలి. పోగొట్టుకున్న స్థలం, తేదీ, ఇతర చిరునామా, అంతకు ముందే ఇచ్చిన పోలీస్ కంప్లయింట్ నంబర్, ఫోన్ యజమాని చిరునామా, ఈమెయిల్ ఐడీ, ధ్రువపత్రాలు, సూచించిన బాక్సుల్లో నింపాలి. వెంటనే సెల్‌ఫోన్ (పాత నంబర్ మీద తీసుకున్న కొత్త సిమ్) నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసిన తర్వాత ఫామ్‌ను సబ్మిట్ చేయాలి. ఆ తర్వాత ఫోన్ దానంతట అదే బ్లాక్ అవుతుంది. ఇకపై దాన్ని ఎవరూ ఆపరేట్ చేయలేరు. అందులో ఉండే డేటా సురక్షితంగా ఉంటుంది. ఒకవేళ దొంగిలించిన వ్యక్తి లేదా సెకండ్ హ్యాండ్‌లో కొన్న వ్యక్తి సిమ్ వేయగానే.. మీ నంబరుకు మెసేజ్ వస్తుంది. ఆ సందేశం ఆధారంగా ఫోన్ ఎక్కడ ఉన్నా.. పట్టుకోవచ్చు.

కేవైఎంతో..
సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్ కొనుగోలు చేయాల్సి వచ్చినప్పుడు అది దొంగలించిందా.. బ్లాక్ లిస్టులో ఉందా.. అన్న విషయం కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలో ముందే తెలుసుకోవచ్చు. మొబైల్‌లో కేవైఎం అని టైప్ చేసి ఐఎంఈఐ నంబర్‌ను నమోదు చేసి 14422కు ఎస్ఎంఎస్ చేసి తెలుసుకోవచ్చు.

10 ఫోన్ల రికవరీ
జిల్లాలో ఫోన్లు చోరీకి గురైన వారితోపాటు ఫోన్లు పోగొట్టుకున్న వారు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు. ఇటీవల సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జిల్లా పోలీసు శాఖ 10 ఫోన్లు రికవరీ చేశారు. ఇందులో అచ్చంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 5, కొల్లాపూర్ పరిధిలో 2, కోడేరు పరిధిలో 1, నాగర్‌కర్నూల్ పరిధిలో 2 ఫోన్లు ఉండగా.. పోలీసులు వాటిని రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

అవగాహన కల్పించాం..



జిల్లాలో ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు, చోరీకి గురైన వారికి సంబంధించి పది సెల్‌ఫోన్లు రికవరీ చేశాం. జిల్లాలోని 22 పోలిస్‌స్టేషన్ల పరిధిలో సిబ్బందికి సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాం.. సెల్‌ఫోన్ వినియోగదారులకు సైతం సీఈఐఆర్ సాంకేతికపై విస్తృత అవగాహన కల్పిస్తాం. సెల్‌ఫోన్ చోరీపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నూతన టెక్నాలజీతో రికవరీ చేస్తాం. – మనోహర్, ఎస్పీ

వైద్య శిబిరాలను వినియోగించుకోండి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: కార్మిక ఆత్మీయ సంబరాల్లో భాగంగా కామన్ సర్వీస్ సెంటర్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో నిర్మాణ రంగ కార్మికులకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లాలోని నిర్మాణరంగ కార్మికులకు మూడురోజుల పాటు నిర్వహిస్తున్న ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది నిర్మాణ రంగ కార్మికులు ఉన్నారని, ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించేలా ప్రచారం చేసుకోవాలని కార్మికులకు సూచించారు. ఉచిత వైద్య పరీక్షల అనంతరం రిపోర్టులు వచ్చాక మరో రోజు వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన సూచనలు చేస్తారన్నారు. రక్త, మూత్ర పరీక్షల వల్ల రాబోయే వ్యాధులను నిర్ధారించుకుని మెరుగైన వైద్యం పొందవచ్చన్నారు. ఈ రోజు వైద్య పరీక్షలు చేయించుకోలేకపోయిన వారు మంగళవారం తూడుకుర్తి, బుధవారం శాయిన్‌పల్లిలో నిర్వహించే వైద్య శిబిరాల్లోనైనా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధికారి అబ్దుల్ షఫియొద్దీన్, సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్, క్యాంపు ఇన్‌చార్జ్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పేద బ్రాహ్మణులను ఆదుకోవాలి'

పాన్‌గల్: జిల్లాలోని పలు దేవాలయాల్లో పనిచేస్తున్న పేద బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి శివాలయాన్ని ఐక్యవేదిక నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయాల్లో పనిచేస్తున్న పూజారులకు ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలలో రూ.2 వేలు నిర్వహణ ఖర్చులు పోగా మిగిలిన రూ.4 వేలు సరిపోక కుటుంబ పోషణ భారంగా మరుతుందని తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రతి పూజారికి నెలకు రూ.20 వేల వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం గ్రామంలో అఖిలపక్ష గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అశోక్‌గౌడ్‌ను నియమించారు.

కదంతొక్కిన కార్మిక లోకం



జిల్లావ్యాప్తంగా సోమవారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడికక్కడ ర్యాలీలు నిర్వహించి ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. తమ హక్కులను సాధించుకోవడానికి ఉద్యమాలు చేపడుతామని పిలుపునిచ్చారు.

వివరాలు 9లో ▸

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని కోడుపర్తి మిట్ట శివారులో రైతు ఎల్లయ్య(45) సోమవారం ఉదయం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. అడవి పందుల బెడద ఉండటంతో పంటకు విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. తన పొలం వద్దకు వెళ్తున్న ఎల్లయ్య ప్రమాదవశాత్తు ఈ కంచెకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నం అటువైపు వెళ్లిన రైతులు గమనించి కుటుంబ సభ్యులకు, అధికారులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుండెపోటుతో 'ఉపాధి' కూలీ..

బల్మూర్: ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే రోజున జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఓ కూలి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం బల్మూర్ మండలం గోదల్ గ్రామంలో చోటుచేసుకుంది. ఆ వివరాలు.. గ్రామానికి చెందిన బొడ్డుపల్లి వెంకటయ్య (45) ప్రతి రోజులాగే సోమవారం గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఉపాధి పనికి వెళ్లాడు ఒక్కసారిగా చాతిలో నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలాడు. మృతుడికి భార్య రజిత, కుమార్తె ఉన్నారు. విషయం తెలియడంతో గ్రామ యువ నాయకుడు పీజేఆర్ గ్రూప్ అధినేత పండుగ జగదీశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వపరంగా కుటుంబాన్ని ఆదుకునేలా ఎంపీడీఓతో పీజేఆర్ మాట్లాడారు.

నవజాత శిశువు..

కల్వకుర్తి టౌన్: స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో నవజాతశిశువు మరణించిన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన అర్చన, తన భర్త శ్రీశైలంతో కలిసి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కాన్పు కోసం ఆదివారం వచ్చారు. సోమవారం తెల్లవారుజామున కాన్పు చేయగా, శిశువుకు కొద్దిగా ఇబ్బంది ఉందని, వెంటనే చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. కొద్దిసేపటికే శిశువు మృతిచెందిందని తెలిపారు. కాన్పును సకాలంలో చేయలేదని, వైద్యుడు లేకుండానే కాన్పు చేయటంతో ఇలా జరిగిందని బాధిత బంధువులు, వారి కుటుంబసభ్యులు ఆరోపించారు.

కారు ఢీకొని బాలిక దుర్మరణం


అభిరా (ఫైల్)

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్ల వద్ద సోమవారం కారు ఢీకొనడంతో ఓ బాలిక మృతి చెందినట్లు ఎస్‌ఐ.భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. ఎల్కిచర్ల గ్రామానికి చెందిన కొత్త మల్లేష్ కూతురు కొత్త అభిర(7) ఇంటి నుంచి కిరాణం దుకాణానికి వెళ్లి తిరిగి రోడ్డు దాటిన తర్వాత నడుచుకుంటూ వస్తుండగా భూత్పూర్ నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బాలికను ఢీకొంది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడున్న గ్రామస్తులు చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ కొద్ది నిమిషాల్లోనే మృతి చెందింది. తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. తెలకపల్లి మండల గడ్డంపల్లికి చెందిన గన్నోజు విష్ణుమూర్తి (75) జిల్లా కేంద్రంలోని తన కుమారుడి ఇంటి వచ్చాడు. రాంనగర్‌కాలనీలో గల కల్లు దుకాణంలో కల్లు తాగుతూ అకస్మాత్తుగా అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కల్తీ కల్లు తాగడం వల్లే మృతిచెందాడని స్థానికులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై ఎస్సై విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. విచారణ చేస్తామని అన్నారు.

జేడీ రహస్య విచారణ?


గద్వాల ఇరిగేషన్ శాఖ విభాగం-4 కార్యాలయం

- సీపీఎస్ నిధుల స్వాహాపై ఆరా
- గద్వాల ఇరిగేషన్ కార్యాలయంలో వివరాల సేకరణ

గద్వాల క్రైం: గద్వాల ఇరిగేషన్‌శాఖ విభాగం-4లో గత ఏప్రిల్ 12న సీపీఎస్ నిధుల కాజేత వ్యవహారంపై పే అండ్ అంకౌట్ అధికారి, సిబ్బంది పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం విధితమే. అయితే ఈ కేసు విచారణలో మాత్రం ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు అన్నట్లుగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. మూడు రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర పీఓ (పెన్షన్ కార్యాలయం) జాయింట్ డైరెక్టర్ శైలజారెడ్డి గద్వాల ఇరిగేషన్‌శాఖ విభాగం- 4 కార్యాలయంలో రహస్య విచారణ చేపట్టి సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది వ్యక్తిగత యూసర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు, హైదరాబాద్ కార్యాలయం యూసర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను టైపిస్టు జహంగీర్ ఎవరి ప్రమేయంతో తెలుసుకున్నాడు? సహకరించిన ఉద్యోగి ఎవరు? ఈ శాఖలో కొలువు ఎలా వచ్చింది? కారుణ్య నియామకమా.. రాత పరీక్షల ద్వారా ఎంపిక అయ్యాడా? సర్వీసు బుక్ తదితర సమాచారంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. సీపీఎస్ నిధులు, ఇతరత్రా ప్రభుత్వ బిల్లులు సైతం కాజేశాడా? పలు విషయాలపై కార్యాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రూ.16, 83,130 నిధులు ఎవరి ఖాతాలోకి మళ్లించాడు. ఆ ఖాతాదారులెవరు? కాజేసిన సీపీఎస్ నిధులతో ఏం చేశాడు? కేసు నమోదైనప్పటి నుంచి పోలీసుశాఖ గుర్తించిన విషయాలు తదితర అంశాలపై ఆరా తీసినట్లు తెలిసింది. జేడీ వచ్చిన విషయాన్ని ఇక్కడి సిబ్బంది బయటికి పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. ఇదిలా ఉండగా గద్వాల ఇరిగేషన్ శాఖలో నాలుగు విభాగాల్లో సిబ్బంది పనిచేస్తున్నారు. వీరి సీపీఎస్ నిధుల విషయమై పూర్తి నివేదికను సీఈ రఘునాథ్‌రావును అడిగినట్లు సమాచారం.

దళారులతో రాజీ..

12వ తేదీ ఫిర్యాదు అయినప్పటి నుంచి టైపిస్టు జహంగీర్ పలువురు దళారులతో రాజీకి తీవ్రంగా మంతనాలు చేస్తున్నట్లు తెలిసింది. ఎలాంటి కేసు లేకుండా చూడాల్సిందిగా వేడుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ మంత్రితో తనను ఈ గండం నుంచి గట్టెక్కించాలని ప్రాధేయపడినట్లు తెలిసింది. తగిన నజరానా సైతం ఇచ్చేందుకు ప్రయత్నం చేశాడని తెలిసింది. అయితే సదరు మంత్రి సైతం కేసు వ్యవహారంపై స్థానిక ఓ నాయకుడితో మాట్లాడి సమస్యను సద్దుమణిగేలా చూడాల్సిందిగా చెప్పినట్లు తెలిసింది. ఇక కేసు విచారణ సైతం పారదర్శకంగా జరగడం లేదని ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు సిబ్బంది మాత్రం ఇక్కడి తీరుపై ఆక్రోశంగా ఉన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు స్పందించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటివరకు కలెక్టర్ సైతం స్పందించకపోవడం, పోలీసులు ఈ వ్యవహారంలో జాప్యం చేయడంపై పెదవి విరుస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ విభాగం-4 అధికారి శ్రీనివాసులును వివరణ కోరగా, జేడీ వచ్చిన మాట వాస్తవామే అన్నారు. పలు విషయాలపై సిబ్బందితో మాట్లాడారని, వ్యవహారం ప్రస్తుతం పోలీసుల విచారణలో ఉందని తెలిపారు. సిబ్బందికి జరిగిన మోసంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

నిలిచిన వర్షపు నీటితో ఆందోళన


చిన్నోనిపల్లి గ్రామం వైపు గుంతల్లో చేరిన వర్షపు నీరు

గట్టు: అకాల వర్షాలు చిన్నోనిపల్లి నిర్వాసితులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో చిన్నోనిపల్లి చుట్టూ ఉన్న వాగులు, వంకలు పొంగిపోర్లాయి. దీంతో వాగుల్లోని వర్షపు నీరు రిజర్వాయర్ కట్ట దగ్గరకు చేరి ఆగిపోయాయి. మొన్నటి దాకా చిన్నోనిపల్లి రిజర్వాయర్ గండి కారణంగా వాగుల్లోని వర్షపు నీరు రిజర్వాయర్ కట్టను దాటుకుని ముందుకెళ్లేవి. అయితే ఇటీవల రిజర్వాయర్ గండిని పూడ్చే పనులు చేపట్టగా ఇప్పటికే 50 శాతం మేర పూర్తయ్యాయి. దీంతో వాగుల్లోని నీరు బయటకు వెళ్లే దారి లేక రిజర్వాయర్ లోపలి భాగంలో నిలిచిపోయాయి. మరో రెండు, మూడు వానలు కురిస్తే, వర్షపు నీరు నివాస గృహాల్లోకి వచ్చే అవకాశం ఉందని నిర్వాసితులు వాపోతున్నారు. రిజర్వాయర్‌ను రద్దు చేయాలని నిర్వాసిత కుటుంబాలు ఏడాది కాలంగా ఆందోళన చేస్తుండగా.. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని పనులు ప్రారంభించారు. రెండు రోజుల క్రితం నిర్వాసిత కుటుంబాలకు చెందినవారు మళ్లీ పనులు జరిగే చోటుకు వెళ్లి అడ్డుకున్నారు. తమకు పునరావాసంలో సరైన వసతులు కల్పించి ఇళ్ల నిర్మాణం పూర్తిచేసిన తర్వాతే రిజర్వాయర్ కట్టను పూర్తి చేయాలని కోరుతున్నారు.

గ్రామాల్లో వరుస చోరీలు


బోదజానంపేట్‌లో పరిశీలిస్తున్న రూరల్ సీఐ జమ్ములప్ప, ఎస్‌ఐ జయప్రసాద్ తదితరులు

బాలానగర్: మండలంలోని బోదజానంపేట్, గౌతాపూర్ గ్రామాల్లో ఆదివారం రాత్రి చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి. బోదజానంపేట్‌లో జరిగిన ఘటనలో 2.5 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.50 వేల నగదుతోపాటు 3 బస్తాల బియ్యం దొంగిలించారని బాధితురాలు ఈశ్వరమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలాలను రూరల్ సీఐ జమ్ములప్పతోపాటు ఎస్‌ఐ జయప్రసాద్ పరిశీలించి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. అయితే గౌతాపూర్‌లో జరిగిన చోరీలపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

నలుగురు విద్యార్థులకు.. 24 మంది విధులు


గ్రౌండ్ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న ఒకే విద్యార్థిని

నారాయణపేట రూరల్: ఓపెన్ స్కూల్ పరీక్షల్లో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. సోమవారం రెండు పూటలు ఓపెన్ స్కూల్ పరీక్షలు జరిగాయి. అయితే మధ్యాహ్నం ఇంటర్ విద్యార్థులకు సోషియాలజీ, టెన్త్ వారికి హోంసైన్స్ పరీక్షలు నిర్వహించారు. దీనికి నలుగురు విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోగా వారికి మూడు సెంటర్లు కేటాయించారు. ఇంటర్ పరీక్ష జరిగిన గ్రౌండ్ స్కూల్ సెంటర్‌లో ఒకరు మాత్రమే హాజరు కాగా.. పరీక్ష విధుల్లో (సీఎస్, డీఓ, సీసీ, ఇన్విజిలేటర్, రిలీవర్, కానిస్టేబుల్, ఏఎస్ఎం, అటెండర్) ఎనిమిది ఉన్నారు. ఇక టెన్త్ పరీక్ష రాయడానికి ముగ్గురు అభ్యర్థులకు రెండు సెంటర్లు కేటాయించారు. డీవీఎం సెంటర్‌లో ఒకరు, నారాయణ స్కూల్ కేంద్రంలో ఇద్దరు పరీక్ష రాయగా వారికోసం 16 మంది డ్యూటీ చేశారు. నారాయణపేట జిల్లాలో ఓపెన్ టెన్త్ పరీక్షకు 512మందికి 458 మంది, ఓపెన్ ఇంటర్ పరీక్షకు 329 మందికి 302 మంది హాజరయ్యారు.

100 పడకల ఆస్పత్రి పరిశీలన



జడ్చర్ల: ప్రారంభానికి సిద్ధమవుతున్న ఏరియా ఆస్పత్రిని సోమవారం రాత్రి తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు సందర్శించారు. ఆస్పత్రిలో వసతులు కల్పనకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఆస్పత్రిని సందర్శించిన వారిలో టీఎస్ఎంఎస్ఐడీసీ ఎస్ఈ సురేందర్‌రెడ్డి, ఈఈ జైపాల్‌రెడ్డి, డీఈఈ వేణుగోపాల్, ఏఈ సాయిగౌడ్ ఉన్నారు.

మొండి మొక్కలతో నష్టం


గట్టు వెంట ముళ్ల పొదలు, మొండి మొక్కలు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: పొలాల గట్ల వెంట, ఖాళీ పొలాల్లో ఉన్న మొండి మొక్కలు, పొదలు పెరిగి రైతులకు నష్టాన్ని కలుగజేస్తాయి. వీటిని తొలగించడం రైతులకు శ్రమతో పాటు ఖర్చుతో కూడుకున్నది. మొండి మొక్కలు, పొదలను వేర్లతో సహా పెకిలించాలి. నరికి వదిలేస్తే మళ్లీ చిగురించి పిలకలు వేస్తాయి. కావున వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వ్యవసాయశాఖ ఏడీఏ సక్రియానాయక్ వివరించారు.

రసాయనాల పిచికారీతో..

తుమ్మ, అడవి రేగు, సర్కార్ తుమ్మ గుబురుగా పెరుగుతాయి. వీటిని నిర్మూలించడానికి 24-డీ ఎమైన్ సాల్ట్‌ను 58 శాతం ద్రావణం లేదా 24-డి ఇథైల్ ఎస్టర్ 36 శాతం ద్రావణం ఒక లీటర్ నీటికి 5 మి.లీ. కలిపి ఆకులు బాగా తడిచేలా పిచికారీ చేయాలి. ఇవేగాక గ్లైఫోసేట్ మందును లీటరు నీటికి 10 మి.లీ. అమ్మోనియం సల్ఫేట్‌తో కలిపి పిచికారీ చేయాలి. దీంతో మందు ఆకుల ద్వారా మొక్కల వేర్లలోకి ప్రవేశించి క్రమంగా చనిపోతాయి.

వేరు ద్వారా రసం పీల్చుకొనే పద్ధతి..

ఈ విధానంలో తొలగించాల్సిన మొక్క పక్కన కొంచెం తవ్వి చూపుడు వేలు మందం ఉన్న ఒక వేరును ఏటవాలుగా కత్తిరించాలి. ఒక పాలిథిన్ సంచిని తీసుకొని అందులో 10 మి.లీ. గ్లైఫోసేట్, 10 మి.లీ. నీరు కలిపిన మిశ్రమం పోసి వేరు కొన అంచు మునిగేటట్లు ఉంచి 24 గంటలు అలానే ఉంచాలి. దీంతో వేరు ద్వారా మందు ద్రావణం చెట్టంతా చేరి చనిపోతుంది. ఈ పద్ధతిలో అడవి రేగు, జిల్లెడు వంటి చెట్లను చంపవచ్చు.

బెరడు తీసి మందు వాడే పద్ధతి..

పెద్ద చెట్లకు బెరడు ఉంటుంది. భూమట్టం నుంచి ఒక మీటరు ఎత్తులో చెట్టు చుట్టూ ఉన్న బెరడును కత్తితో కోసి ఈ ప్రదేశంలో రసాయనాన్ని కలపడం, పోయడం, బ్రష్‌తో పూయడం చేయాలి. ఈ పద్ధతిలో 24 డి ఎమైన్, 24 డి ఇథైల్ ఎస్టర్, గ్లైఫోసేట్ మందు ఒక పాలు.. నాలుగు పాళ్ల నీటిలో కలిపి పోయాలి. అవసరమైతే నెల తర్వాత మరోమారు చేయాల్సి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చెట్టు నరికిన లేదా బెరడు తొలగించిన వెంటనే మందు మిశ్రమాన్ని వాడాలి.
- మొక్కలు బాగా పెరిగే దశలో రసాయనాలు పిచికారీ చేయాలి.
- వాతావరణం పొడిగా ఉన్న సమయాల్లో మాత్రమే కలుపు మందులు వాడాలి.
- గాలి తక్కువగా వీచే సమయాల్లోనే మందు పిచికారీ చేయాలి.
- చుట్టుపక్కల ఇతర పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు ఉన్నప్పుడు కలుపు మందును జాగ్రత్తగా పిచికారీ చేయాలి. లేకపోతే గాలి ద్వారా పక్క పంటలపై పడి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుంది.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ చట్టాన్ని కాపాడుకుందాం


కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగన్న

హన్వాడ: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేసేలా రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపట్టి లక్ష సంతకాలతో ప్రభుత్వానికి నివేదిద్దామని వక్తలు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం అవకతవకలకు నిలయంగా మారుతోందని అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కూలీలతో జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. మే డే సందర్భంగా తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి ఎంపీపీ బాల్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య, మహిళా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ, తెలంగాణ సర్వీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న, బౌద్ధసంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిష్టయ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బాలాగౌడ్, తెలంగాణ సర్వీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మహిళా కార్యదర్శి స్వాతి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. గ్రామగ్రామాన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరిచి ప్రభుత్వానికి లక్ష సంతకాలతో డిమాండ్ చేయడాన్ని అందరూ ఈసందర్భంగా ఏకగ్రీవంగా బలపరిచారు. ఈనెల 1నుంచి మొదలుకుని 31వ తేదీ వరకు సంతకాల సేకరణ చేసి రాజధాని హైదరాబాద్‌లో కూలీలు, ప్రజాసంఘాలతో ప్రత్యేక సదస్సును నిర్వహించిన తదనంతరం, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నివేదికలు ఇవ్వనున్నట్లు టీవీవీయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగన్న తెలిపారు. హన్వాడతో పాటు నవాబ్‌పేట, మహమ్మదాబాద్, గండేడ్ మండలాల ఉపాధి హామీ కూలీలు, నాయకులు వేపూర్ ఆంజనేయులు, మాణిక్యబాయి, బాలమణి, వెంకటయ్య, అచ్చన్న పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించకపోవడం సరికాదు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు మూడు నెలలుగా గ్రాట్యుటీ చెల్లించకపోవడం సరికాదని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎ.రాజసింహుడు అన్నారు. జిల్లా కేంద్రం పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో సోమవారం ఆర్టీసీ, ఇతర ప్రభుత్వ సంస్థల ఈపీఎస్ పెన్షనర్ల విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 2021 డిసెంబర్ నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, 2013 పీఆర్సీకి సంబంధించిన బాండ్ల డబ్బులు, మరికొందరికి సకలజనుల సమ్మె వేతనాన్ని కూడా చెల్లించలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం హయ్యర్ పెన్షన్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సిన వివరాలను ఫోరం నాయకుడు అబ్దుల్ కరీం వివరించారు. సమావేశంలో నాయకులు ఆర్.నారాయణ, బీహెచ్.కుమార్, అబ్దుల్ బషీర్, వెంకన్న, బుచ్చన్న, రాజు, రాంచందర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో తెలంగాణ పల్లెలు: ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి


నెక్కొండలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: ప్రగతి పథంలో తెలంగాణ పల్లెలు పయనిస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. స్వరాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలు రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. సోమవారం నెక్కొండలోని పలు అభివృద్ధి పథకాలకు భూమి పూజ చేయడంతో పాటు, మరికొన్నింటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాకముందు గ్రామీణ ప్రాంతాలలో కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు ఉండేవని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రతి గ్రామానికి బీటీ రోడ్డుతో పాటు ఇంటింటికి తాగు నీరు, విద్యుత్, డ్రెయినేజీ, గ్రామంలో సీసీ రోడ్లు, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం తదితర మౌలిక సౌకర్యాలను సమకూర్చిన ఘనత తమదేనన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, జాతీయస్థాయిలో మన పల్లెలకు అవార్డులు దక్కుతుండడమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం కృషి

బాదేపల్లి మార్కెట్‌లో బీఆర్ఎస్ కార్మికల విభాగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మేడే సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

నీటిలో మునిగి మహిళ మృతి

మదనాపురం: ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మహిళ మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలోని దుప్పల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మురళి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొడుగు నారమ్మ(45) సోమవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని ఊకచెట్టు వాగులో పశువులను మేపడానికి వెళ్లింది. ఈ క్రమంలో అక్కడ ఉన్న నీటి గుంటలోకి పశువులు దిగగా.. వాటిని బయటకు కొట్టేందుకు నీటిలోకి దిగగా.. ఈత రాకపోవడంతో మునిగిపోయింది. గమనించిన తోటి పశువుల కాపరులు ఆమెను కాపాడేందుకు ప్రయత్నించి వెలికితీశారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

ఈతకు వెళ్లి బాలుడి గల్లంతు


దీక్షిత్

రాజాపూర్: స్నేహితులతో కలిసి వ్యవసాయ బావిలో సరదాగా ఈతకు వెళ్లిన ఓ బాలుడు గల్లంతైన సంఘటన సోమవారం మండలంలోని ఖానాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడకు చెందిన గోపాల్, సుజాత దంపతుల కుమారుడు గోనెల దీక్షిత్(15) గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో ఈ కోసం సోమవారం స్నేహితులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో దీక్షిత్ బావిలోకి దూకి పైకి రాకపోవడంతో వెంటనే కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో కొందరు గ్రామస్తులు బావిలో దూకి వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా బాలుడి ఆచూకీ లభించకపోవడంతో మోటార్ల సహాయంతో బావిలోని నీటిని బయటికి తోడుతున్నారు. దీక్షిత్ రంగారెడ్డిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల 9వ తరగతి పరీక్షలు రాశాడు. ఇద్దరు కుమారుల్లో పెద్దవాడైన దీక్షిత్ బావిలో గల్లంతు కావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

చికిత్స పొందుతూ మహిళ..

నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని చందుబట్లకు చెందిన ఊషమ్మ(45) గత నెల 26న తన తమ్ముడితో కలిసి చంద్రకల్‌కు వెళ్తుండగా మండలంలోని పెద్దముద్దునూరు గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి ఊషమ్మ తమ్ముడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతుల వారీగా పంట నష్టం సర్వే


రాజాపూర్ మండలం ఖానాపూర్‌లో క్షేత్రస్థాయి సర్వే చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పంటలకు నష్టం వాటిల్లింది. వ్యవసాయశాఖ ప్రాథమిక సర్వే నిర్వహించి 793 ఎకరాలలో వరి, ఇతర పంటలకు నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదించారు. ఇందులో 753 ఎకరాలలో వరి, 40 ఎకరాలలో కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. తాజాగా రైతు వారీగా క్షేత్రస్థాయి పంటల నష్టంపై సమగ్ర సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పక్కాగా సర్వే చేపట్టి వివరాలు నమోదు చేస్తేనే పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందనుంది. ఈ దిశగా కార్యాచరణ రూపొందించాల్సి అవసరం వ్యవసాయశాఖపై ఉంది.

తప్పిదాలు జరగొద్దు..

ప్రభుత్వంతో పాటు జిల్లా ఉన్నతాధికారులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా పంటల నమోదులో ఏటా తప్పిదాలు జరుగుతున్నాయి. తాజాగా అకాల వర్షాలతో జిల్లాలోని జడ్చర్ల, రాజాపూర్, మహమ్మదాబాద్, నవాబుపేట, చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాలతో పాటు ఇతర ప్రాంతాల్లో పెద్దఎత్తున పంటలకు నష్టం వాటిల్లింది. ప్రాథమిక అంచనా కంటే నష్టం పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అకాల వర్షాలకు కోతకు వచ్చిన వరి కంకుల గింజలు పూర్తిగా రాలిపోయాయి. ప్రభుత్వం నిర్దేశించిన 33 శాతం కంటే అధికంగానే నష్టం జరిగింది. ఒక్కో రైతుకు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో విస్తీర్ణం పక్కాగా నమోదు చేయడంతో పాటు నష్టం శాతాన్ని సైతం నిర్దేశిత పద్ధతుల్లో గణించాల్సిన అవసరం ఉంది. పరిహారం కోసం రైతులు ప్రభుత్వం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయి సర్వే చేపట్టాలని ఏఈఓలు, ఏఓలకు ఆదేశాలు జారీ చేశాం. సర్వే చేపట్టి పంట నష్టం వివరాలు నమోదు చేస్తున్నారు. రైతుకు చెందిన బ్యాంకు ఖాతా నంబరుతో పాటు ఫోన్ నంబర్ సేకరించి నమోదు చేయాలని నిర్దేశించాం. డివిజన్, మండలాల వ్యవసాయశాఖ అధికారులు సైతం క్షేత్రస్థాయి పర్యటనలు చేసి సర్వే జరుగుతున్న తీరును పర్యవేక్షిస్తారు.

– బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

తుని రైలు దహనం కేసు కొట్టివేత

ముద్రగడ పద్మనాభంతో పాటు 41 మందికి ఊరట

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): తుని రైల్వే స్టేషన్ సమీపంలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు దహనం కేసులో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంతో పాటు 41 మందిని నిరపరాధులుగా పేర్కొంటు ఆర్‌పీఎఫ్ పోలీసులు వారిపై పెట్టిన కేసును కొట్టివేస్తున్నట్లు విజయవాడ రైల్వే న్యాయమూర్తి తీర్పువెలువరించారు. 2016 జనవరి 31న ముద్రగడ పద్మనాభం నాయకత్వంలో తునిలో తలపెట్టిన కాపు గర్జన బహిరంగ సభ హింసాత్మకంగా మారింది. ఆ సమయంలో అటుగా వస్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలును కొంత మంది నిలిపివేసి దహనం చేశారు. ఈ ఘటనపై ఆర్‌పీఎఫ్ పోలీసులు కేసులు నమోదు చేసి ముద్రగడ పద్మనాభం, ఎమ్మెల్యే దాడిశెట్టి రాజాతో పాటు మొత్తం 41 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ వారు 24 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ముద్దాయిలు నేరం చేసినట్లు ఎక్కడ ఆధారాలతో నిరూపించలేకపోవడంతో వారిని నిరపరాధులుగా భావించి కేసును డిస్మిస్ చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. ఈ కేసు దర్యాప్తు చేసిన ముగ్గురు తుని ఆర్‌పీఎఫ్ అధికారులు సరైన సాక్ష్యాదారాలను ప్రవేశపెట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారిపై శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలని తీర్పులో వెల్లడించారు.

థాయ్‌లాండ్‌లో చిక్కిన చీకోటి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రావెన్సీలో ఉన్న ఆసియా హోటల్‌లోని ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన పేకాట స్థావరంపై అక్కడి పోలీసులు సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో (అక్కడి కాల మాన ప్రకారం) దాడి చేశారు. మొత్తం 94 మందిని అదుపులోకి తీసుకోగా వారిలో చీకోటి ప్రవీణ్, మాధవరెడ్డితోపాటు మరో 83 మందిని భారతీయులుగా గుర్తించారు. వారిలో అత్యధికులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన వారేనని, 14 మంది మహిళలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కెసినో నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ప్రవీణ్, మాధవరెడ్డి, సిత్రానన్ సహా ఆరుగురిని మాత్రమే అరెస్టు చేశారని, పేకాట రాయుళ్లకు కౌన్సెలింగ్ చేసి, జరిమానా వేసి పంపినట్లు థాయ్ మీడియా ప్రకటించింది.

ఒక్కొక్కరి నుంచి రూ. 4 లక్షలు వసూలు చేసి...

థాయ్‌లాండ్‌లో కెసినోల నిర్వహణకు అనుమతి ఉన్నప్పటికీ ఒకేసారి పెద్ద మొత్తంలో ఆర్జించాలని భావించిన చీకోటి, మాధవరెడ్డి... థాయ్ మహిళ సిత్రానన్‌తో కలసి అక్రమంగా కెసినో నిర్వహణకు పథకం వేశారు. అనేక మంది పేకాటరాయుళ్లతో (పంటర్లు) ఒప్పందాలు కుదుర్చుకొని వారి నుంచి హైదరాబాద్‌లో ప్రాథమిక మొత్తంగా రూ. 4 లక్షల చొప్పున వసూలు చేశారు. గత నెల 26న హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో తీసుకువెళ్లిన


స్వాధీనం చేసుకున్న నగదు


పోలీసులు అదుపులో భారతీయులు

వారికోసం పటాయాలోని ఆసియా హోటల్‌లో గత నెల 27 నుంచి సోమవారం వరకు గదులు బుక్ చేశారు. అదే హోటల్‌లో శాంపోయ్ పేరుతో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌ను అద్దెకు తీసుకున్నారు. అందులోనే అక్రమంగా కెసినో కేంద్రం ఏర్పాటు చేశాడు. దీని నిర్వహణకు సిత్రానన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ప్రవీణ్... ఒక్కో పంటర్‌కు రూ. 50 వేలు చెల్లించాడు. హైదరాబాద్ నుంచే తీసుకువెళ్లిన గేమింగ్ చిప్స్ అందించి పేకాట ఆడిస్తున్నాడు. ఈ క్యాంప్ ముగిశాక హైదరాబాద్ వచ్చాకే నగదు లావాదేవీలు చేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇలా చేస్తే ఫెమా వంటి సెక్షన్ల కింద నమోదయ్యే ఈడీ కేసుల నుంచి తప్పించుకోవచ్చని ప్రవీణ్ పథకం వేశాడు. ఐదు రోజులపాటు జరిగిన ఈ పేకాట శిబిరంలో రూ. కోట్ల లావాదేవీలు జరిగినట్లు తెలిసింది. సోమవారం దాడి చేసిన పోలీసులు రూ. 16 లక్షల విలువైన భారత కరెన్సీ, రూ. 20 కోట్ల విలువైన గేమింగ్ చిప్స్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ పట్టుబడిన పంటర్లలో మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డితోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నట్లు తెలిసింది. థాయ్‌లాండ్‌లో ప్రవీణ్ అండ్ గ్యాంగ్ అరెస్టు విషయం తెలిసిన హైదరాబాద్ పోలీసులతోపాటు నిఘా వర్గాలు, ఈడీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు.

70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

వచ్చే సీజన్లో వ్యవసాయ శాఖ లక్ష్యం
- కంది పంట సాగును ప్రోత్సహించాలి
- మార్చికల్లా యాసంగి కోతలు పూర్తి చేయాలి
- వ్యవసాయంపై మంత్రి నిరంజన్‌రెడ్డి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: వచ్చే వానాకాలం సీజన్‌లో 70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా ప్రకటించింది. కనీసం 60 లక్షల నుంచి 65 లక్షల ఎకరాల్లో సాగయ్యేలా చూడాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన సచివాలయంలోని వ్యవసాయశాఖ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన తొలి సమీక్షలో వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులతో మాట్లాడారు. రానున్న వానాకాలంలో 1.40 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు చేయాలని పేర్కొన్నారు. మరో 14 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు వేసేలా చూడాలన్నారు. అందుకనుగుణంగా వ్యవసాయశాఖ సమాయత్తం కావాలని ఆదేశించారు. పత్తితోపాటు కంది సాగును మరింత ప్రోత్సహించాలని, ప్రస్తుతం వివిధ పంటల సాగుకు అవసరమయ్యే 18 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. సేంద్రీయ సాగు, భూసారాన్ని దృష్టిలో ఉంచుకుని పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు చర్యలు తీసుకోవాలనీ దీనికి రూ.76.66 కోట్లు నిధుల విడుదల చేయాలని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటల సాగుకై డీసీసీబీల ద్వారా ఎకరానికి రూ.40 వేలు వరకు పంటరుణాలు అందించాలని సూచించారు.

వరి సీజన్‌ను ముందుకు జరపాలి...

ప్రతీ ఏడాది మార్చి చివరి వరకు యాసంగి కోతలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటే వడగళ్ల వానల నుంచి నష్టాన్ని నివారించవచ్చని నిరంజన్‌రెడ్డి సూచించారు. వానాకాలం సాగు సమయంలోనే యాసంగి వరి సాగు నారుమళ్లకు అవసరమయ్యే భూమిని వదులుకోవాలని చెప్పారు. బాన్సువాడ, బోధన్, హుజూర్‌నగర్, మిర్యాలగూడల మాదిరిగా వరి సాగు సీజన్ ముందుకు జరపాలని సూచించారు. సమీక్షలో రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షు లు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ఉద్యానశాఖ డైరెక్టర్ హన్మంతరావు, ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్ పాల్గొన్నారు.

జూడాల సమ్మె నేపథ్యంలో సెలవులు రద్దు

మెడికల్ కాలేజీలు, బోధనాసుపత్రుల అధికారులకు డీఎంఈ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: జూనియర్ డాక్టర్లు (జూడా) బుధవారం నుంచి సమ్మె తలపెట్టిన నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ బోధనాసుపత్రుల్లో వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని వైద్యవిద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లకు సర్క్యులర్ జారీ చేశారు. తమ స్టైపెండ్‌ను 15 శాతం పెంచాలని, న్యాయమైన ఇతర సమస్యలు పరిష్కరించాలని జూడాలు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డీఎంఈ పలు చర్యలకు నడుం బిగించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకులకు అన్ని సెలవులు రద్దు చేసినట్లు డీఎంఈ పేర్కొన్నారు. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అధ్యాపకుల డ్యూటీ రోస్టర్‌ను మూడు షిఫ్టుల్లో సిద్ధం చేయాలన్నారు. ఏ విభాగంలోనైనా అసిస్టెంట్ ప్రొఫెసర్లు తక్కువగా ఉంటే, అసోసియేట్ ప్రొఫెసర్‌ను కూడా విధుల్లో ఉంచాలన్నారు. సంబంధిత ప్రొఫెసర్లు, విభాగాధిపతులు తమ యూనిట్లను నిశితంగా పర్యవేక్షించాలన్నారు. రోగుల వైద్య సేవలపై సమ్మె ప్రభావం పడకుండా చూడాలన్నారు.

ఢిల్లీలో వ్యాపారం.. హైదరాబాద్‌లో ఆస్తులు

▶ మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, శరత్‌చంద్రా రెడ్డి, కవిత సన్నిహితుడు వి.శ్రీనివాసరావు, ఆంధ్రప్రభ పబ్లికేషన్స్, ఇండియా అహెడ్, ఫీనిక్స్ గ్రూపు, ఎస్‌గ్రోత్ క్యాపిటల్, క్రియేటివ్ డెవలపర్స్ తదితరుల పేర్లను ప్రస్తావించింది. నిందితుల వాంగ్మూలాల ఆధారంగా అసాధారణ అంశాలు వెలుగులోకి వచ్చాయని చెప్పింది.

చార్జిషీటులోని ముఖ్యాంశాలు

- ఆప్ నేతలకు సౌత్‌గ్రూపు రూ.100 కోట్లు హవాలా రూపంలో ముడుపులిచ్చింది. తద్వారా మద్యం విధానం తమకు అనుకూలంగా ఉండేలా చూసుకుంది.
- అరుణ్‌పిళ్లైకి క్రియేటివ్ డెవలపర్స్ భాగస్వాములు, రవిశంకర్ చెట్టి రూ.5 కోట్లకు హైదరాబాద్‌లో భూమి అమ్మారన్న ఆరోపణలున్నా వారెవరూ అరుణ్‌పిళ్లైను కలవలేదు. ఈ ఒప్పందాన్ని ఫీనిక్స్ రియల్ ఎస్టేట్ గ్రూప్‌నకు చెందిన శ్రీహరి చర్చలు జరిపి ఖరారు చేశారు. భూమి కొనుగోలు నిమిత్తం సంస్థకు ఒకరు డబ్బులు బదిలీ చేస్తారని చెప్పిన శ్రీహరి.. ఎవరు డబ్బులు బదిలీ చేశారనేది రవిశంకర్ చెట్టికి చెప్పలేదు. అయితే, ఎస్‌గ్రోత్ కాపిటల్ పేరుతో ఫీనిక్స్ గ్రూపునకు చెందిన శ్రీహరి ఆ భూమిని కొనుగోలు చేసినట్లు బుచ్చిబాబు తన వాంగ్మూలంలో చెప్పారు. ఆ సమయంలో ఫీనిక్స్ గ్రూపునకు సీఈవోగా శ్రీహరి ఉన్నారు. దీంట్లో కవిత భర్త అనిల్‌కుమార్ కూడా భాగస్వామి. కవిత తెలంగాణలో పెద్ద రాజకీయ నాయకురాలు కావడంతో మార్కెట్ రేటు కంటే తక్కువకే భూమి కొనుగోలు చేశారు. దీంతోపాటు కవిత మరో ప్రాపర్టీ కూడా కొనుగోలు చేశారు. 25వేల చదరపు అడుగుల ప్రాపర్టీకి సంబంధించిన పేపర్ వర్క్‌ను బుచ్చిబాబు, శ్రీహరి పూర్తిచేశారు. మార్కెట్ ధర చదరపు అడుగు రూ.1,760 ఉంటే రూ.1,260 మాత్రమే చెల్లించారు. కవితతో గణనీయమైన ఆర్థిక లావాదేవీలున్న వ్యక్తి రవిశంకర్‌తో భూమి కొనుగోలుకు చర్చలు జరిపినట్లు నిర్ధారణకు వచ్చాం. ఇండోస్పిరిట్స్‌లో కవిత తరపున అరుణ్‌పిళ్లై ప్రతినిధిగా వ్యవహరించి రూ.32.86 కోట్లు అందుకున్నారు. పిళ్లై సూచన మేరకు రూ.25.5 కోట్లు నేరుగా ఇండోస్పిరిట్స్ నుంచి పిళ్లై ఖాతాకు బదిలీ అయ్యాయి.
- ఢిల్లీ ఎయిర్‌పోర్టులో మద్యం దుకాణం నిమిత్తం ఎన్‌వోసీ కోసం జీఎంఆర్ గ్రూపునకు చెందిన బీవీ నాగేశ్వరరావుతో మాగుంట రాఘవ, ఎంపీ ఎంఎస్ రెడ్డి చర్చలు జరిపారు. ఎంఎస్ రెడ్డి వాట్సాప్ సందేశాల ద్వారా ఇది వెల్లడైంది. వ్యాపారంలో భాగస్వాములై ఎన్‌వోసీ ఇవ్వాలని కోరినట్లు తేలింది. ఇండోస్పిరిట్స్‌లో అరుణ్ పిళ్లై ప్రాక్సీ భాగస్వామి. ఇండోస్పిరిట్స్ నుంచి లాభాలు తన నుంచి కవితకు చేరడంపై అరుణ్‌పిళ్లై స్టేట్‌మెంట్ల ద్వారా వెల్లడైంది.
- ఏప్రిల్ 2022లో ఢిల్లీ హోటల్లో విజయ్‌నాయర్‌తో కవిత, అరుణ్‌పిళ్లై సమావేశమయ్యారు. వ్యాపారం కుంటుపడుతున్న నేపథ్యంలో చెల్లించాల్సిన లంచాలు రికవరీ చేయడంపై చర్చించారు. హోటల్ రికార్డుల ద్వారా దీన్ని ధ్రువీకరించుకున్నాం. దినేశ్ ఆరోరా, అరుణ్‌పిళ్లై వాంగ్మూలాలు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి.
- కిక్‌బ్యాక్‌ల రూపంలో సొమ్ములు వెనక్కి మళ్లించే పనులను అభిషేక్ బోయినపల్లి, అరుణ్‌పిళ్లై నిర్వహించినట్లు ఆడిటర్ బుచ్చిబాబు వాంగ్మూలమిచ్చారు. సౌత్‌గ్రూప్ నుంచి కిక్‌బ్యాక్‌లను విజయనాయర్ అందుకుంటున్నారన్నారు. విజయ్ నాయర్‌కు డబ్బు అవసరమని బుచ్చిబాబు ఫోను నంబర్ల ద్వారా చేసిన వాట్సాప్ సందేశాల ద్వారా ధ్రువీకరణ అయింది. దీంట్లో 'వీ'కి డబ్బు కావాలి అంటే విజయ్‌నాయర్‌కు డబ్బు అవసరమని అర్థమని బుచ్చిబాబు తెలిపారు.
- ఢిల్లీ, హైదరాబాద్ హోటళ్లలో జరిగిన సమావేశాల్లో సౌత్‌గ్రూపు నుంచి విజయ్‌నాయర్‌కు డబ్బులు పంపడంపై ప్రధానంగా చర్చ జరిగినట్లు కూడా బుచ్చిబాబు తెలిపారు. క్రియేటివ్ డెవలపర్స్ ఖాతాకు డబ్బు మళ్లించడం కూడా బుచ్చిబాబు నోట్స్ ద్వారా తెలిసింది. కవిత తరఫున ఇండోస్పిరిట్స్ నుంచి వచ్చిన లాభాలను అరుణ్‌పిళ్లై అందుకొని ఆమె ఆదేశాల మేరకు పెట్టుబడులు పెట్టాల్సి ఉందని ధ్రువీకరణ అయింది. భూముల కొనుగోలులో శ్రీహరి సూచనల మేరకు కవిత తరఫున సొమ్ములు బదిలీ చేయడం వరకే పిళ్లై పాత్ర పరిమితమని తేలింది. అయితే, మే 2022 నుంచి రిజిస్టర్ కాకుండా ఉన్న భూమి 11.10.22న అరుణ్‌పిళ్లై భార్య పేరు మీద రిజిస్టర్ కావడం అరుణ్‌పిళ్లై ప్రయోజనం కోసమేనని, కవితకు లాభదాయకం కాదని దర్యాప్తులో తేలింది. అరుణ్‌పిళ్లై ఆదేశాల మేరకే ఇండో స్పిరిట్స్ నుంచి ఆంధ్రప్రభ పబ్లికేషన్స్, ఇండియా అహెడ్‌లకు రూ.కోటి, రూ.70 లక్షలు బదిలీ చేసినట్లు సమీర్ మహేంద్రు తెలిపారు. దీనికి మద్దతుగా ఎలాంటి రికార్డు లేదు. అయితే, అరుణ్‌పిళ్లై చెప్పినట్లుగా ఈ సంస్థలు ఇండో స్పిరిట్స్ లేదా అరుణ్‌పిళ్లైకి ఎలాంటి ఈవెంట్ నిర్వహించలేదు. ఆయా సంస్థలకు ఇచ్చిన సొమ్ము ఇప్పటివరకూ వెనక్కి ఇవ్వలేదు. గౌతమ్ ముత్తాకు అరుణ్‌పిళ్లై బదిలీ చేసిన రూ.4.76 కోట్లు, అభిషేక్‌కు రూ.3.85 కోట్లు బదిలీ రుణం తిరిగి ఇవ్వమని చెప్పినప్పటికీ కాలక్రమేణా ఎలాంటి రుణం లేదని అరుణ్‌పిళ్లై పేర్కొన్నారు.

సచివాలయానికి ఐజీబీసీ గోల్డ్ రేటింగ్

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ అనుకూల పద్ధతులు, నీళ్లు, విద్యుత్ పొదుపు ఏర్పాట్లతో నిర్మించిన కొత్త సచివాలయానికి 'ది ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్'(ఐజీబీసీ) గోల్డ్ రేటింగ్ ఇచ్చింది. కౌన్సిల్ ప్రతినిధులు సోమవారం రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి సచివాలయంలో సర్టిఫికెట్‌ను అందజేశారు. నీటిపొదుపుతోపా టు, వాన నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం తీసుకున్న చర్యలకుగాను సచివాలయం.. ఐజీబీసీ గోల్డ్ రేటింగ్‌కు ఎంపికైంది. నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఈఎన్‌సీ గణపతిరెడ్డి, ఈఈ శశిధర్‌లను మంత్రి అభినందించారు. అంతకుముందు మంత్రి ప్రశాంత్‌రెడ్డి.. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు ఎంతవరకు వచ్చాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే రూ.518 కోట్లతో 1393 కిలోమీటర్ల పొడవైన రోడ్ల మరమ్మతులు పూర్తి చేశామని, రూ.1223 కోట్లతో మరో 2700 కి.మీ. పనులు 45 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. సమీక్షలో ఈఎన్‌సీ రవీందర్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోండి

హైదరాబాద్ యూనివర్శిటీ వీసీ బీజే రావ్



గద్వాల న్యూటౌన్: నూతన జాతీయ విద్యా విధానం సమగ్ర వికాసం, జీవన నైపుణ్యాలను అభివృద్ధి పర్చుకోవడానికి దోహదం చేస్తుందని హైదరాబాద్ యూనివర్శిటీ వీసీ బీజే రావ్ అన్నారు. సోమవారం స్థానిక ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో అలుమిని ఎంఏఎల్‌డీ జీడీసీ గద్వాల, పీజీ సెంటర్ పాలమూరు యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఎన్‌ఈపీ– 2020 ఆపర్చునిటీస్ అండ్ చాలెంజెస్ ఫర్ ద గ్రాడ్యుయేట్స్ అండ్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టీడిసిప్లినరీలో జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. నూతన జాతీయ విద్యావిధానం ద్వారా పొందే ఉపాధి అవకాశాలను వివరించారు. కేరళ సెంట్రల్ యూనివర్శిటీ వీసీ వెంకటేశ్వర్లు, పాలమూరు యూనివర్శిటీ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, పీజీ సెంటర్ ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సంపత్‌కుమార్, వనపర్తి కళాశాల ప్రిన్సిపల్ శ్రీనునాయక్, అలుమిని కోశాధికారి అయ్యపురెడ్డి, బీఎస్ ఆనంద్, నారాయణగౌడ్, అప్సర్‌పాష, రాజ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరస్తు.. శుభమస్తు

- రేపటి నుంచి కల్యాణ ఘడియలు
- జూన్ 11 వరకు పెళ్లిళ్ల సందడి
- వివాహాలపై అనుబంధ రంగాల వారి ఆశలు
- ఇప్పటికే నగలు, వస్త్ర దుకాణాల్లో జోరుగా వ్యాపారం



అచ్చంపేట: పెళ్లిళ్ల సందడి నెలకొంది. గురు మూఢం కారణంగా ఏప్రిల్‌లో పెళ్లిళ్లకు శుభ ముహూర్తాలు లేవు. ఈ క్రమంలో బుధవారం నుంచి మంచి ముహూర్తాలు ఉండటంతో భాజాభజంత్రీలు మోగనున్నాయి. దీంతో వివాహాలు, గృహ ప్రవేశాలు, పుట్టుపంచె, చీరలు, పుట్టు వెంట్రుకలు తీయడం తదితర శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ముహూర్తాలు పెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో బుధవారం నుంచి జూన్ 11 వరకు మంచి ముహూర్తాలు ఉండటంతో వివాహాల హడావుడి కనిపిస్తోంది. ఇప్పటికే కల్యాణ మండపాలన్నీ బుక్ అయ్యాయి. పురోహితులు, ఫొటోగ్రాఫర్లు, కేటరింగ్, డెకరేషన్, బ్యూటీపార్లర్, ట్రావెల్స్, నూతన వస్త్రాలు కుట్టేందుకు టైలర్స్, బ్యాండ్‌మేళం నిర్వాహకులకు గిరాకీ పెరిగింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ నెల రోజుల్లో 3 వేలకు పైగా వివాహాలు జరగనున్నట్లు అంచనా.

మండపాలు రిజర్వు..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వెయ్యికిపైగా కల్యాణ మండపాలు ఉన్నాయి. అయితే ఇవన్నీ బుక్ అయినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. చిన్న మండపాలకు రూ.వేలల్లో ఉంటే, పెద్ద ఫంక్షన్ హాళ్లకు, ఏసీ హాళ్లకు రూ.లక్షల్లో ధర పలుకుతోంది.

విందు.. పసందు

వివాహ విందులో రకరకాల వంటకాలు, భిన్న రుచులు అందించేలా ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. మండపం అలంకరణ సినిమా సెట్టింగ్‌లను తలపిస్తోంది. అందంగా తీర్చిదిద్దేందుకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. వేడుకలను లైవ్ ప్రోగ్రాం చేసేందుకు ఇష్టపడుతున్నారు. హైదరాబాద్, కర్నూలు నుంచి పూలను తెప్పించి ఫ్లవర్ డెకరేషన్ చేస్తున్నారు. ఇప్పటికే వస్త్రాలు, బంగారు ఆభరణాల దుకాణాలు కొనుగోళ్లతో సందడిగా కనిపిస్తున్నాయి.

దివ్యమైన ముహూర్తాలు

ప్రధానంగా బుధవారం వచ్చేనెల 11 వరకు మంచి ఘడియలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఈ నెలలోనే వరుసగా 4, 5, 6, 7, 8, 10, 11, 12, 21, 26, 27, 28, 30, 31, జూన్‌లో 1, 3, 7, 8, 9, 10, 11 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. మళ్లీ జూన్ 19నుంచి ఆషాఢ మాసం మొదలై జూలై మొతం అధిక శ్రావణం కావడంతో ఆగస్టు 18 వరకు ముహూర్తాలు లేవు. తిరిగి ఆగస్టు 19న మంచిరోజులు ప్రారంభమై డిసెంబర్ 31 వరకు ఉన్నాయి.

28 మంచి రోజులు...

ఏప్రిల్‌లో ముహూర్తాలు లేవు. మే, జూన్ నెలల్లో 28 మంచి రోజుల్లో పెళ్లిళ్లు జరగనున్నాయి. మళ్లీ జూలైలో మంచి రోజులు లేవు. ఆగస్టు 19 నుంచి మంచి రోజులు ప్రారంభమై డిసెంబరు 31 వరకు ఉన్నాయి. పెళ్లిళ్లతోపాటు గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు అనువైన కాలం.

– శ్రీనివాసశర్మ, పురోహితులు, అచ్చంపేట

నా రాజకీయ పరిజ్ఞానంతో ఓడిస్తాం


కరపత్రాలు పంచుతున్న చిన్నారెడ్డి తదితరులు

- హాథ్ సే హాథ్ జోడో యాత్రలో చిన్నారెడ్డి
- ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ

వనపర్తి టౌన్: 'నియోజకవర్గంలో ఇంటింటికి తిరిగిన అనుభవం, నా రాజకీయ పరిజ్ఞానంతో వనపర్తిలో మంత్రి నిరంజన్‌రెడ్డిని ఓడిస్తాం.. అందుకే వనపర్తిలో ప్రతి గడపను వదిలిపెట్టకుండా తొక్కుతున్నా' అని ఏఐసీసీ కార్యదర్శి, పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌కు మరోసారి ఓటేసేందుకు సిద్ధంగా లేమని గ్రామీణ ప్రజలు చెబుతుంటే పాదయాత్ర చేస్తున్నందుకు తృప్తి కలుగుతుందన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం జిల్లాకేంద్రంలోని కేడీఆర్‌నగర్‌లో ఇంటింటికి తిరుగుతూ రాహుల్ సందేశంతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తిలో ఇంతటి అవినీతి మంత్రిని ప్రజలెన్నడూ చూడలేదన్నారు. నాగవరం వద్ద ఉండే డీసీఎంఎస్ గోదాంలను కూలగొట్టి, షెడ్లు పడగొట్టి నచ్చిన వ్యక్తులకు పెట్రోల్ బంకు ఇచ్చాడని ఆరోపించారు. దత్తపుత్రుడిని అడ్డం పెట్టుకొని చేయరాని పనులు నిరంజన్‌రెడ్డి చేస్తున్నారని మండిపడ్డారు. కృష్ణానదిలో 80 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని, చెరువుల్లో ఒండ్రుమట్టిని తరలించి ఆయిల్‌పాం తోటలు సాగుచేసుకున్నాడని విమర్శించారు. నిరంజన్‌రెడ్డి ధనబలంతో గెలవాలని చూస్తున్నా.. ప్రజలు ఓటేసేందుకు సిద్ధంగా లేరన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షుడు విజయ్‌చందర్, నాయకులు రాములు, కిరణ్‌కుమార్, రవి, జనార్దన్, అబ్దుల్లా, వెంకటేష్, జాన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ వద్దంటూ రిలే నిరాహార దీక్ష


నంచర్ల గేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజలు

మహమ్మదాబాద్: ప్రమాదకర ఫార్మా కంపెనీ వద్దంటూ చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు, రైతులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మండలంలోని నంచర్లగేట్ (దేశాయిపల్లి) పరిధిలోని మినీ ఇండస్ట్రీలో కలర్ కంపెనీ చాటున ఏర్పాటు చేయనున్న ఫార్మా కంపెనీ వద్దంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈ కంపెనీతో రైతులకు, పశువులకు, వ్యవసాయ పొలాలకు, చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలకు ఎంతో ప్రమాదం వాటిల్లుతుందని వాపోయారు. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కంపెనీ ఏర్పాటును విరమించుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ, కొమిరెడ్డిపల్లి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం నాయకుడు నర్సింహులు, రాజేందర్, కృష్ణయ్య, పాషా, బాలకృష్ణ, అంజనేయులు, నరేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండం

నవాబుపేట: ఓం నమఃశివాయ.. ఓం వీరభద్రయా.. అంటూ నిప్పు కనికలపై నడిచి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. మండలంలోని లోకిరేవు వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం అగ్ని గుండం నిర్వహించగా.. పలువురు భక్తులు అందులో నడిచి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఆలయ పూజారి లింగయ్య, వీరన్న, రాజు, మాజీ సర్పంచ్ వెంకటేష్, శ్రీనివాస్, బాలు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలి: పేట ఎస్పీ


వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఏఎస్పీ నాగేంద్రుడు

నారాయణపేట రూరల్: సరిహద్దు చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎంతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో కర్ణాటక సరిహద్దు కలిగిన జిల్లాలోని పోలీసుస్టేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 10న కర్ణాటకలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి మద్యం, డబ్బులతో పాటు వస్తువులు అక్రమంగా రవాణా జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. బోగస్ ఓటర్లను తరలించే అవకాశం ఉండటంతో వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో మరో మూడు చెక్‌పోస్టులు జలాల్‌పూర్, కాన్‌కుర్తి, సమస్తాపూర్‌లలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రామ్‌లాల్, రవిబాబు, సీతయ్య, డేవిడ్, శ్రీనివాస్‌రావు, విజయ్, రమేష్, నరేందర్, అక్రం పాల్గొన్నారు.

ఏఎస్పీ పరిశీలన

తెలంగాణ-కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులను సోమవారం అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లాలోని జలాల్‌పూర్ చెక్‌పోస్టులో సిబ్బందితో మాట్లాడారు. చాలా జాగ్రత్తగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించిన తర్వాతనే వదిలి పెట్టాలన్నారు. నగదు, మద్యం, వస్తువుల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు వాహనాల్లో వెళ్తుంటే పూర్తి విచారణ చేపట్టాలన్నారు. తనిఖీ సమయంలో స్థానిక పోలీసు బృందం ఉన్నారు.